# లంకలో జరిగిన కథ

రామరావణ యుద్ధం ముగిసింది. జయలక్ష్మి రామచంద్రుడిని వరించడంతో సీత మనస్సు కుదుట పడింది. విభీషణుడు లంకకు రాజు అయ్యాడు.

అందరూ అయోధ్యకు వెళ్లాలనే సంబరంలో ఉన్నారు. పుష్పక విమానం కోసం ఎదురు చూస్తున్నారు.

ఒక చెట్టునీడను సీత కూర్చుని ఉంది. ఆమె చూపులు అల్లంత దూరాన ఉన్న ఒక సన్నికల్లు మీద పడ్డాయి. అది చూడ ముచ్చట గొలుపుతూ ఉంది. దాన్ని అయోధ్యకు తీసుకువెళ్లాలనుకుంది. వెంటనే తన మనోభిప్రాయాన్ని ఆంజనేయుడికి తెలిపింది. అందుకు ఆ నమ్మిన బంటు సరే అన్నాడు.

ఆంజనేయుడు సన్నికల్లుని పైకి తీసి శుభ్రం చెయ్యసాగాడు. అది చూసేసరికి జాంబవంతుడికి నవ్వాగలేదు. ఆంజనేయుడి దగ్గరికి వచ్చి 'నాయనా, దీన్ని ఎందుకు శుభ్రం చేస్తున్నావు?' అని అడిగాడు. 'అయోధ్యకు తీసుకువెళ్లాలట! అందుకని శుభ్రం చేస్తున్నాను' అన్నాడు ఆంజనేయుడు, ఇంకా శుభ్రం చేస్తూనే.

'ఈ సన్నికల్లునా' అంటూ జాంబవంతుడు పెద్దగా నవ్వాడు; పొట్ట చెక్కలయ్యేలా నవ్వాడు.

ఆంజనేయుడు తికమక పడ్డాడు. 'ఇది అమ్మవారి ఆజ్ఞ' అన్నాడు తల పైకెత్తి.

జాంబవంతుడు మళ్లీ పెద్దగా నవ్వాడు. అమ్మవారికి ఇంత పెద్ద లంకలో యీ సన్నికల్లు తప్ప మరేమీ కనిపించలేదా? ఇంతకంటే అందమైన వస్తువు మరొకటి కనిపించకపోవడం ఆశ్చర్యంగా వుంది– అన్నాడు. అలా

అని సీత వద్దకు బయలుదేరాడు. అవాయకుడిలా ముఖం పెట్టి ఆంజనేయుడు ఆయన వెళ్లిన దారివైపు చూడసాగాడు.

'ఒక చిన్న మనవి' అంటూ జాంబవంతుడు సీతను సమీపించాడు. ఆమె బదులు కోసం ఎదురు చూశాడు.

జాంబవంతుడు వయస్సులో పెద్దవాడు. అందరికన్నా పెద్దవాడు. సగౌరవంగా ఏమిటని అడిగింది సీత. అప్పుడు జాంబవంతుడు అసలు సంగతి చెప్పడం మొదలుపెట్టాడు.

'మీకు తెలియంది కాదు. నేను చాలా పెద్దవాణ్ణి. వయస్సులో ఇక్కడున్న వాళ్లందరూ నాకంటె చిన్నవాళ్లే. ఎన్నో సంగతులు విన్నాను; ఎందరినో చూశాను...'

'అవును. ఇందులో సందేహం ఏముంది? పైగా మీ విషయం నలుగురికీ తెలిసిందే.'

'తల్లీ! అమృతం కోసం దేవతలూ రాక్షసులూ పోటీపడి సముద్రం మథించడం నేను కళ్లారా చూశాను. ఆ సముద్ర మథనంలో నేనూ నా శక్తియుక్తుల్ని యథోచితంగా ప్రదర్శించాను. ఇప్పుడా విషయం తలచుకుంటే చాలు, మళ్ళీ ఆ నాటి ఉత్సాహం పుట్టుకువస్తోంది. ఆహా! దేవదానవులు తమ బలాబాలాలు చూపి సముద్రాన్ని ఎలా మథించారని...'

సీత చిరునవ్వు నవ్వింది. అందులోని ఆంతర్యాన్ని గ్రహించి జాంబవంతుడిలా అన్నాడు.

'నాకు అమృతం రుచి చూసే అదృష్టం కలగనే దనేగా మీరు నవ్వారు. అమృతం సేవించకపోయినా, నేనింతకాలం జీవించడం చూస్తే నాకే ఆశ్చర్యం కలుగుతోంది.' ఆయన పెదవులమీద మందహాసం గోచరించింది.

'అదే మీ గొప్పతనం' అంది సీత.

'దీనికేంగాని తల్లీ, బ్రహ్మదేవుడికి ఆ రోజుల్లో అయిదు ముఖాలుండేవి. ఈ విషయం చాలా మందికి తెలీదు. అయిదు తలల బ్రహ్మదేవుణ్ణి చూసిన అదృష్టవంతుణ్ణి నేను, ఎన్ని తలలుంటే మాత్రం ఏం! దురదృష్టవంతుడు. ఆయన అహంకారమే ఆయన్ని దెబ్బ తీసింది. శివుడికి

కోపం తెప్పించి ఒక తలను కాస్తా పోగొట్టుకున్నాడు. అప్పటినుంచీ బ్రహ్మదేవుడికి చతుర్ముఖుడనే పేరు వచ్చింది.'

జాంబవంతుడి సంతోషాన్ని చూసి సీత మురిసిపోయింది. 'ఓ! అదా కథ! అయిదు తలలున్నప్పుడు కూడా ఆయన పని సృష్టించడమే గదా?' అడిగింది అమాయకంగా.

'మొదటినుంచీ ఆయనపని అదే. ఆయన సృష్టిలో ఎన్ని వింతలూ విడ్డూరాలని! ఆ రోజుల్లో కొండలకు రెక్కలుండేవి. అప్పుడవి చూడడానికి బాగుండేవి. కాని ఇంద్రుడు కాస్తా ఆ రెక్కల్ని నరికి వెయ్యడంతో, పాపం కొండలు ఉన్న చోటనే ఉండిపోయాయి...'

ఆయన మాటలకు అడ్డువచ్చి సీత అందిగదా! 'మైనాకమనే కొండ రెక్కలతో సహా సముద్రంలో దాక్కున్నదని విన్నాను. నిజమేనా!'

'అవును. ఇంద్రుని ధాటికి నిలవలేక మైనాకుడు సముద్రాన్ని ఆశ్రయించాడు. సముద్రమంటే గుర్తుకి వస్తోంది. సముద్రపు నీళ్ళుయిప్పుడు కటికి వుప్పులు గాని, పూర్వం కొబ్బరినీళ్లలా వుండేవి. ఆ నీళ్లు నేను రుచి చూశాను.'

'ఏమిటి! పూర్వం సముద్రపు నీళ్లు తియ్యగా వుండేవా?' సీత అడిగింది కనుబొమలు పెద్దవి చేస్తూ.

'అవును తల్లీ, నేనన్నది నిజం.'

మళ్లీ సముద్రజలమంతా తియ్యగా మారిపోతే ఎంత బావుంటుంది! నీటి కరువు మందుకైనా వుండదు –అనుకుంది సీత.

ఇంతలో జాంబవంతుడు, 'ఇంకో విచిత్రం కూడా చూశాను తల్లీ' అని చెప్పడం మొదలు పెట్టాడు. 'ఇప్పుడు మన్మథుడికి శరీరమంటూ లేదు కనుకనే, అందరూ ఆయన్ని అనంగుడని పిలుస్తున్నారు. కాని నేను చూసిన మన్మథుడు మహా అందగాడు! చేతిలో చెరకు విల్లు, చెంత రతీదేవి – ఆహా ఆ మన్మథుణ్ణి చూడడానికి వెయ్యికళ్లున్నా సరిపోవు. ఏం లాభం? శివుడు తన కంటిమంటతో ఆయన్ని దహించివేశాడు....'

సీత జాలిగా 'పాపం' అన్నది.

'తప్పు చేసిన వాణ్ణి శిక్షించవలసిందే గదా తల్లీ! ఆ పరమ శివుడికి కోపం తెప్పించి ప్రాణాలతో బయటపడిన వాళ్లెవరైనా వున్నారా లోకంలో! రతీదేవి దీనంగా ప్రార్థించేసరికి, అంతకోపంలోనూ, ఆ శివుడు చల్లబడిపోయి, 'నీభర్త రూపం నీకు ఒక్కదానికి మాత్రమే కనిపించుగాక!' అని వరమిచ్చాడు.

'శివుడు దయా సముద్రుడు గదా మరి!'

'అవును తల్లీ. ఇందులో ఏమీ సందేహం లేదు. ఆయన నిజంగానే దయాసముద్రుడు! లేకపోతే ఆ రోజు – అంటే – సముద్రమథనం జరిగిన రోజున అమృతం వెలువడేందుకు ముందు భుగభుగ మంటూ మంటలు గ్రక్కుతూ హాలాహలం బయటపడింది. అది చూసీ చూడడంతోనే దేవతలందరూ గజగజ వణికి పోయారు. వాళ్లకేమీ తోచలేదు. కాని దేవతలంటే శివుడికెంత అభిమానం! ఆ అభిమానం కొద్దీ అప్పుడు శివుడు మంటలు గ్రక్కుతున్న హాలాహలాన్ని మింగి తన కంఠంలోనే వుంచుకున్నాడు. అందువల్ల ఆ రోజు నుంచీ నీలకంఠుడయ్యాడు. మొదట్లో ఆయన కంఠం మన అందరిలా మామూలుగా ఉండేది.... మరో చిత్రం..'

ఏమిటి అన్నట్లుగా సీత జాంబవంతుడి వైపు ఆశ్చర్యంగా చూసింది.

ఆయన మందహాసం చేస్తూ 'అమ్మా! ఇంద్రుడికి ఎన్నికళ్లో మీకు తెలుసా?' అడిగాడు.

'వెయ్యి కళ్లు.'

'అహల్యను ఆశించిన తర్వాత ఇంద్రుడికి వెయ్యికళ్లు కలిగిన మాట నిజమే. మరి అంతుక మునుపు?'

తెలియదన్నట్లుగా సీత తల అడ్డంగా తిప్పింది.

'నేను రెండుకళ్ల ఇంద్రుణ్ణి చూశాను...'

'అలాగా! ఇన్ని వింతలు చూసిన వాళ్లు మరెవరైనా వున్నారాయిక్కడ?' జాంబవంతుణ్ణి చూస్తూ ప్రశ్నించింది. 'లేరు తల్లీ, నేను తప్ప' అన్నాడు నవ్వుతూ.

అందుకు సీత కూడా చిరునవ్వు నవ్వింది.

'తల్లీ! ఇక్కడున్న వాళ్లందరూ నా కళ్ల ముందు పుట్టి పెరిగిన వాళ్లే. వాళ్లేం చూశారని! ఇంతకాలం నేను బతికున్నందుకు ఇలాంటి చిత్రవిచిత్రాలెన్నో చూశాను. చాలా గొప్ప వారినీ చూశాను. వాళ్లతో స్నేహమూ చేశాను. ఇన్ని వింతలూ విడ్డూరాలు చూశాను గాని, యిప్పుడే ఆంజనేయుడు చెప్పిన యీ వింతను మాత్రం నేనింతవరకూ చూడలేదు, వినలేదు...'

ఉన్నట్టుండి జాంబవంతుడిలా అనడంతో సీతకు కొంచెం ఆశ్చర్యంగా కలిగింది. ఏమిటా వింత? అనుకుంది. ఆలోచించింది. అయినా ఆ వింతయేమీ అంతుపట్టలేదు.

అప్పుడు జాంబవంతుడు, 'తల్లీ! మీరు మరోవిధంగా అనుకోవద్దు. ఆంజనేయుడు నా కంతా వివరంగా చెప్పాడు. మీరేదో సన్నెకల్లుని అయోధ్యకు తీసుకురమ్మని ఆజ్ఞాపించారట...'

'అవును.'

'అయితే నేను విన్నదంతా నిజమేనన్నమాట!'

'ఆ సన్నెకల్లు చూడముచ్చటగా వుంది. అందుకే తీసుకు రమ్మన్నాను... అది సరే. దీనికి మీరు చెప్పదలచిన విషయానికీ సంబంధ మేమిటి?'

'సంబంధం లేకేం తల్లీ. రామచంద్రమూర్తి లంకను విభీషణులవారికి యిచ్చివేసిన విషయం మీకు తెలుసు.'

'స్వామి వారి చేతులమీదుగా విభీషణుడికి అభిషేకం జరిగింది. ఆ ఉత్సవంలో నేనూ పాల్గొన్నాను గదా!'

'కనుక లంకలోని ప్రతిరేణువూ విభీషణుడికి చెందుతుంది.'

'నేను మాత్రం కాదన్నానా?'

'మీరు కాదనలేదు. కాని యిచ్చిన సొమ్ములోంచి గోరంతైనా తీసుకోవాలని కోరడం పెద్దవాళ్లకి ధర్మం కాదు. అది సన్నెకల్లయినా సరే, సాన

బట్టిన వజ్రమైనా సరే – యిచ్చింది తిరిగి తీసుకోవడం న్యాయ మనిపించు కోదు. అందువల్ల తీసుకున్న వారికి పాపం చుట్టుకుంటుంది.

'అలాగా!'

'అవును తల్లీ! నేను ఎన్నో వింతలు చూశానని యింతకు ముందు మనవి చేశానుగదా! అయితే యిచ్చినదాన్ని తిరిగి తీసుకున్న వింతను మాత్రం చూడలేదు. ఈ సంగతి తమకు మనవి చేసుకుందామని యిక్కడికి వచ్చాను' అన్నాడు జాంబవంతుడు ప్రశాంతంగా.

'మీరు నాకు హితోపదేశం చేశారు! కృతజ్ఞురాలిని.'

'ఎంతమాట! తమకేవిటి నేను హితోపదేశం చెయ్యడమేవిటి! తమరు పూజ్యులు.'

'వెంటనే ఆంజనేయుణ్ణి పిలిపించండి. సన్నికల్లు తీసుకురావద్దని చెపుతాను?

'ఆ శ్రమ తమకెందుకు తల్లీ. తమ ఆజ్ఞ మేరకు నేనే చెపుతాను' అంటూ అమ్మవారివద్ద అనుజ్ఞ తీసుకుని కార్యం సాధించిన సంతోషంతో ఆంజనేయుడి వద్దకు బయలుదేరాడు జాంబవంతుడు.

(రుచికరమైన యీ కథకు ఆధారం సుప్రసిద్ధ విద్వాంసులు శ్రీ కి.వా. జగన్నాథన్ గారు గ్రంథస్థం చేసిన ప్రాచీన తమిళగేయం. ఆ గేయాన్ని యథాతథంగా ఉదహరిస్తున్నాను.

అలైకడల్ కడైయక్కండేన్
అయన్ ఐన్దు సిరముం కండేన్
మలై యిరు సిఱగు కండేన్
సిలై యదన్ వడివు కండేన్
శివన్ సుద్దక్కళుత్తు క్కండేన్
కులవరి యిరుకణ్ కండేన్
కొడుత్తదై వాంగ క్కాణేన్

ఇక నా తెలుగుసేత:

**కంటి సాగర మథనమ్ము, కంటి అయిదు**
**తలల బ్రహ్మను, కంటి రెక్కల గిరులను,**
**కమ్మని కడలి నీటిని గంటి, ఇక్షు**
**చాపుని కనుగొంటి, శివుని చక్కని మెడ**
**గంటి, రెండు కండ్ల మఘువు గంటి, యిచ్చి**
**మరల తీసికొనెడు వింత నరయనైతి.**

(ఆంధ్ర పత్రిక సచిత్ర వార పత్రిక, 4-9-1970)